క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి: పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ టీబీ కిరణ్ గురువారం తెలిపారు. పట్టణంలోని కుక్కఅంతరాల రోడ్డు, కొత్తపేట, సుందరయ్య కాలనీలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రామకృష్ణ



సత్తెనపల్లి: ఆర్య వైశ్య యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన కొత్త రామకృష్ణను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు దూపకుంట్ల శబరి వరప్రసాద్ పంపిన నియామక ఉత్తర్వులు ఆయన గురువారం అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని భవిరిశెట్టి వారి వీధిలో ఉన్న కొత్త రామకృష్ణ జ్యుయలరీ షాపు వద్ద ఆర్యవైశ్య నాయకులు ఆయనను సత్కరించారు. రామకృష్ణ ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి వెళ్లిన సందర్భంగా పలువురు ఆర్య వైశ్య సంఘం నాయకులు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దేవరపల్లి కాశీ, ఆటపా అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు, యువ న్యాయవాది తవ్వా హరనాథ్, చక్క రవి కుమార్, ఆడిటర్ మోటమర్రి చంద్, చక్క రవి కుమార్, త్రిపురమల్లు రవి, కొప్పురావూరి కాశీ, భవిరిశెట్టి హరి, గోళ్ళ సాయి, స్వామి ప్రసాద్, దేవరశెట్టి రఘు కిషోర్, శిఖాకొలను హరీష్, కాకర్ల రమేష్, మాచర్ల సత్యనారాయణ, కొల్లిపర కుమార్ తదితరులు ఉన్నారు.

జీవో 58ను అమలు చేయాలి

సత్తెనపల్లి: కుల ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు కలుగుతున్న ఇబ్బందుల తొలగింపుకు జీవో 58ని అమలు చేయాలని ప్రగతి మాదిగ దాసు సంక్షేమ సేవా సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంకాళ్ల నాగరాజు కోరారు. గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్‌గనోరేను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గత 30 ఏళ్లగా మాదిగ దాసులు కుల ధ్రువీకరణ పత్రాలు ఆర్డీవో కార్యాలయం నుంచి పొందుతున్నామని, దీంతో కాలయాపన జరిగి సకాలంలో ప్రభుత్వ రాయితీలు పొందలేక పోయామన్నారు. ఈ ఇబ్బందులను అర్థం చేసుకొని గత ప్రభుత్వం జీవో 58 విడుదల చేసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి తీసుకునేలా సవరణ చేసిందన్నారు. కాగా ఈ జీవోను అమలు చేయకుండా తహసీల్దార్ కార్యాలయ అధికారులు మరలా పూర్వపు పద్ధతిలోనే ఆర్డీవో కార్యాలయానికి సిఫార్సు చేస్తున్నారన్నారు. జీవోను అమలు చేయకుండా రెవెన్యూ అధికారులు తమ జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఆయనతో పాటు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ పల్నాడు జిల్లా కో ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప ఉన్నారు.

నిరుపేద విద్యార్థినికి 'స్నేహహస్తాలు' చేయూత



అచ్చంపేట: ఆర్థిక ఇబ్బందులతో చదువు మధ్యలోనే ఆపేసిన ఓ విద్యార్థినికి స్నేహహస్తాలు ఫౌండేషన్ చేయూతనిచ్చింది. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రాఘవ తిరుపతమ్మ ఉన్నత చదువుల నిమిత్తం స్నేహహస్తాలు ఫౌండేషన్ వారు గురువారం రూ.15,000 చెక్కు అందజేశారు. తిరుపతమ్మ అచ్చంపేటలోని జెడ్పీ హైస్కూలులో 10వ తరగతి, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. ఆ పై చదువులు చెప్పించే ఆర్థిక స్థోమత లేక తల్లిదండ్రులు కూలి పనులకు పంపారు. విషయం తెలుసుకున్న స్నేహహస్తాలు ఫౌండేషన్ గత ఏడాది సత్తెనపల్లిలోని ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ కోర్సులో చేర్పించి రూ.25 వేల చెక్కును అందజేశారు. ఈ ఏడాది కూడా హాస్టల్ ఫీజుల నిమిత్తం రూ.15 వేల చెక్కు అందజేస్తున్నట్లు సంస్థ ప్రతినిధి తాయి కరిముల్లాబాబు తెలిపారు. డిగ్రీ పూర్తయ్యే వరకు చేయూతనిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బి.సురేఖ, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

పిడుగురాళ్ల: విద్యార్థిని చదువు కోసం సత్య సాయి బాబా ట్రస్టు సభ్యులు ఆర్థిక సాయం గురువారం అందజేశారు. పట్టణానికి చెందిన గ్రంధి కీర్తి నరసరావుపేటలోని ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని రెండవ సెమిస్టర్ కోసం ట్రస్టు సభ్యులు ఉడతా వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం సతీమణి రత్నమాల రూ.10 వేలు అందజేసినట్లు మందిరం కన్వీనర్ గర్రె నాగేశ్వరరావు తెలిపారు.

గడువు తీరితే.. గడప దాటించండి

- కాలం చెల్లిన సిలిండర్లతో అప్రమత్తత అవసరం
- జాగ్రత్తలతోనే ప్రమాదాలను నివారించవచ్చు



వంట గ్యాస్ సిలిండర్లు

బెల్లంకొండ: మనం వినియోగించే ప్రతి వస్తువుకు కాల పరిమితి ఉంటుంది. అది ఉన్నంత వరకూ మనకు ఎంతో ఉపయోగపడుతుంది. అదే గడువు తీరితే అదే వస్తువు మన పాలిట యమపాశమవుతుంది. మనం నిత్యం వంట గదిలో ఉపయోగించే వంట గ్యాస్ సిలిండర్ కూడా ఈ కోవకు చెందినదే... గ్యాస్ సిలిండర్‌కూ గడువు ఉంటుందన్న విషయం చాలా మందికి తెలియదు. దీంతో కొన్ని చోట్ల అగ్ని ప్రమాదాలు జరుగుతుంటే, మరి కొన్ని చోట్ల అవగాహన లేక గడువు తీరిన ఇటువంటి సిలిండర్లనే ఉపయోగిస్తున్నారు. కాలం చెల్లిన సిలిండర్లను వినియోగించే వారిని చైతన్య పరచవలసిన అవసరం ఎంతైనా ఉంది.

గడువు తీరిన సిలిండర్లు ప్రమాదకరం

కొందరు సిలిండర్లు కొన్న తరువాత వాటిని వాడకుండా నెలల తరబడి నిల్వ ఉంచుతారు. మరి కొందరు బ్లాక్‌లో కొని మరీ వాడుతుంటారు. అయితే సిలిండర్లపై గుర్తించిన గడువు తేదీ లోగా వాడితేనే ఉత్తమం. కాలం చెల్లిన వాటిని వాడటం ద్వారా ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు చాలా ఉన్నాయి.

ఖాళీ సిలిండర్లకూ గడువు ఉంది

ఖాళీ సిలిండర్‌కు కూడా నిర్దిష్ట కాల పరిమితి ఉంటుంది. దాని కాల పరిమితి ఏడు సంవత్సరాలు. తయారీ దారులు తమ రికార్డుల్లో లేని బ్యాచ్ నంబర్ల ప్రకారం ఏడేళ్లు దాటిన సిలిండర్లను డీలర్ల నుంచి వెనక్కు తెప్పించుకుని పరీక్షిస్తారు. ఏ మాత్రం వినియోగ యోగ్యం కాని, నాణ్యత లేని సిలిండర్లను తయారీ దార్లు తుక్కుగా పరిగణించి పక్కన పెట్టేస్తారు.

మూడు నెలలకో అక్షరం

సంవత్సరంలోని 12 నెలలను 4 భాగాలుగా విభజించి, వాటికి ఆంగ్ల భాషలోని మొదటి నాలుగు అక్షరాలు ఏ, బీ, సీ, డీ అని పేరు పెట్టారు. అందుకోసం జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు 'ఏ' తో.. ఏప్రిల్, మే, జూన్‌లకు 'బీ' తో.. జూలై, ఆగస్ట్, సెప్టెంబర్‌లకు 'సీ' తో అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు 'డీ' తో గుర్తిస్తారు. ఉదాహరణకు సిలిండర్‌పై 'బీ–24' అని రాసి ఉంటే 2024 జూన్ వరకూ మాత్రమే వినియోగించుకోవాలని తెలుసుకోవాలి. ఆ నెల దాటితే సిలిండర్ గడువు తీరినట్లే అని తెలుసుకుని దూరం పెట్టాలి.

గడువు తీరిన సిలిండర్లను తిరస్కరించండి



సిలిండర్లపై అంకెల గురించి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తెలుసుకోవాలి. సిలిండర్లకు గడువు అయిపోయిందని గుర్తిస్తే వాటిని వెంటనే తిరస్కరించాలి. అటువంటివి ఇళ్లలో ఉంటే వాటిని కూడా త్వరగా ఖాళీ చేయడం ఉత్తమం. సిలిండర్లపై ఉన్న చిహ్నాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. తద్వారా ప్రమాదాల బారి నుంచి రక్షించుకోవచ్చు.

–అఫ్రపున్నీసా బేగం, తహసీల్దార్, బెల్లంకొండ

సచివాలయ సిబ్బందికి శిక్షణ



సత్తెనపల్లి: ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నైపుణ్య గణన సర్వే ప్రారంభమవుతున్న తరుణంలో సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరెడ్డి, నైపుణ్య శిక్షణ అధికారి రామకృష్ణారెడ్డిలు సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఫోన్లో మొబైల్ అప్లికేషన్‌పై అవగాహన కల్పించారు. ఇందులో 15 నుంచి 59 మధ్య వయసు గల వారికి నైపుణ్య గణన సర్వే నిర్వహించి వారి ఆకాంక్ష నెరవేర్చే విధంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆచార్య ఎన్జీ రంగా జయంతి

సత్తెనపల్లి: పట్టణంలోని అమరావతి బస్టాండ్ సెంటర్‌లో ఆచార్య ఎన్జీ రంగా జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎన్జీ రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్షణ



ధరణికోటలో ర్యాలీ



అనుపాలెంలో ర్యాలీ



ఎర్రబాలెంలో ర్యాలీ

అమరావతి: ముందస్తు పరీక్షలు, అవగాహనతోనే క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చునని అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డి.శివరత్నకుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ధరణికోట–1 హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివరత్నకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవటంతో పాటు నివారణ, చికిత్సల గురించి తెలుసుకోవటం అవసరమన్నారు. పురుషులలో నోరు, ఊపిరితిత్తులు, ఉదర క్యాన్సర్‌లు ఎక్కువగా కనిపిస్తుంటే మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌లు కనిపిస్తున్నాయన్నారు. బాధితులలో 60 శాతం మంది 35 నుంచి 65 సంవత్సరాల వయసు వారే ఉన్నారని తెలిపారు. క్యాన్సర్‌కు పొగాకు ఉత్పత్తులు కారణమవుతున్నాయన్నారు. అమరావతి పీహెచ్‌సీ వైద్యాధికారి లీలా ప్రసాద్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యమన్నారు. క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 18 సంవత్సరాలు నిండిన వారందరి ఆరోగ్య సమాచారాన్ని సేకరిస్తారన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమరావతి, అత్తలూరు పీహెచ్‌సీల సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

14వ తేదీ నుంచి క్యాన్సర్‌పై అవగాహన

రాజుపాలెం: ఆరోగ్య సిబ్బంది ఈ నెల 14వ తేదీ నుంచి ఇంటింటికి వెళ్లి క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ పరీక్షలు నిర్వహిస్తారని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్ తెలిపారు. మండలంలోని అనుపాలెంలో క్యాన్సర్ నియంత్రణ చర్యలలో భాగంగా అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార(సర్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను మండల వ్యాప్తంగా నిర్వహిస్తారని తెలిపారు. తొలిదశలో కమ్యూనిటీ హెల్త్ అధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి మహిళలకు క్యాన్సర్ గురించి అవగాహన కల్పిస్తారు. రొమ్ములో ఏర్పడే గడ్డల గురించి వివరించి అవసరమైతే తగిన జాగ్రత్తలతో ఇంటిలోనే పరీక్షలు నిర్వహిస్తారు. గర్భాశయ సమస్యలను అడిగి తెలుసుకుంటారు. నోటి క్యాన్సర్‌ను కూడా గుర్తిస్తారు. గుండెపోటు లక్షణాలను కూడా వివరిస్తారని తెలిపారు. సుమారు 8 నెలల పాటు ఈ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ర్యాలీలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ

ఎర్రబాలెం(క్రోసూరు): జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎర్రబాలెంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు, ర్యాలీ గురువారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు డాక్టర్ ధనుష్, డాక్టర్ సిరి చందన మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్స చేస్తే త్వరితగతిన నయమవుతుందన్నారు. మహిళల్లో ఎక్కువగా రొమ్ము క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయన్నారు. దీనిపై ప్రభుత్వం అవగాహన కల్పించి 18 సంవత్సరాలు నిండిన మగవారికి, ఆడవారికి స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించబోతున్నట్లు తెలిపారు. 12 ఏళ్ల కంటే ముందే రజస్వల అయిన ఆడపిల్లలు, పిల్లలు లేని మహిళలు, ఊబకాయం ఉన్న మహిళలు, మద్యం, పొగాకు తాగే వారికి అధికంగా క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధ్యయనాల్లో తేలిందన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ దేశంలో ప్రతి 13 నిమిషాలకు ఒక మహిళ బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడి చనిపోతున్నారని, అవగాహన,



చంద్రాజుపాలెంలో ర్యాలీ

అప్రమత్తత, ముందస్తు గుర్తింపు, స్వీయ పరీక్ష, స్క్రీనింగ్ ద్వారా రక్షణ పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు శివుడు, అమర జ్యోతి, ప్రభావతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రజిని, ఆరోగ్య కార్యకర్త స్వప్న, స్టాఫ్ నర్స్ రాణి తదితరులు పాల్గొన్నారు.

స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్ గుర్తింపు

బెల్లంకొండ: స్క్రీనింగ్‌పరీక్షల ద్వారానే క్యాన్సర్ వ్యాధిని గుర్తించడం సాధ్యమవుతుందని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.వి.కోటేశ్వరరావు తెలిపారు. గురువారం మండలంలోని అన్ని గ్రామాలలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలను వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ త్వరలోనే ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వే ద్వారా క్యాన్సర్ గుర్తింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నోటి క్యాన్సర్, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌లపై అవగాహన కల్పించి వాటి లక్షణాల ద్వారా అనుమానిత వ్యక్తులను గుర్తించి, స్క్రీనింగ్ పరీక్షలకు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ రాణి, హెల్త్ సూపర్‌వైజర్ బాషా, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి ఆలయ చోరీ కేసులో ఆరుగురి అరెస్ట్



మాదిపాడు పంచాయతీ పరిధిలోని సత్తెమ్మతల్లి

అచ్చంపేట: మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని అడవిలో స్వయంభుగా వెలసిన సత్తెమ్మతల్లి ఆలయ చోరీ కేసులో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ తెలిపారు. గత నెల అక్టోబరు 20వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు సీసీ కెమెరాల వైర్లు కత్తిరించి ఆలయంలోకి ప్రవేశించి హుండీని పగులగొట్టి అందులో ఉన్న రూ.1.70 లక్షల నగదు, 1300 గ్రాముల వెండి ఆభరణాలు దోచుకుపోయిన విషయం తెలిసిందే. ఈ కేసులో పూర్తి ఆధారాలతో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా, పెనుగంచిప్రోలుకు చెందిన ఆటోడ్రైవర్ ఎల్లబోయిన గోపి, మటన్ కొట్టు నడిపే అద్దంకి గురవయ్య, బోడపాడుకు చెందిన అద్దంకి శివ, అణికినపాడుకు చెందిన ముంగి రాములు, గూడెం గ్రామానికి చెందిన ముంగి కృష్ణ, కొలిగుల గ్రామానికి చెందిన శిరం వంశి తదితరులను అదుపులోకి తీసుకుని సత్తెనపల్లి కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. పట్టుబడిన వారంతా ఎన్టీఆర్ జిల్లా, పెనుగంచిప్రోలు మండలంలోని వివిధ గ్రామాలకు చెందినవారు కావడం గమనార్హం.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఏసీడీపీవో సంతోషకుమారి

ముప్పాళ్ళ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని గ్రామాల్లో బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన పెంపొందించాలని ఐసీడీఎస్ ఏసీడీపీవో జె.సంతోషకుమారి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో పోక్సో చట్టంపై మండల స్థాయి సిబ్బంది, ఏఎన్‌ఎంలు, వీఆర్వోలకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ ఏసీడీపీవో సంతోషకుమారి బాల్య వివాహాలు, హక్కులు గురించి అవగాహన కల్పించారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసు ప్రొటెక్షన్ ఆఫీసర్ వై.ప్రశాంత్ పోక్సో చట్టం, పీసీపీఎన్‌డీటీ, బాలిక విద్యాహక్కు చట్టం గురించి వివరించారు. మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య గురించి ఐసీడీఎస్ కార్యాలయ అధికారి నవీన వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది నానమ్మ, ఈవోపీఆర్డీ రూపవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జి.జయలక్ష్మి, అనంతలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ



రిజిస్టర్లను పరిశీలిస్తున్న జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖాధికారి

రాజుపాలెం: నెలకు ఐదు కాన్పులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేసే విధంగా చర్యలు చేపట్టాలని పల్నాడు జిల్లా డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పద్మావతి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో గర్భిణులు, బాలింతలకు చేసే సేవల రిజిస్టర్లు, శిశువులకు ఇచ్చే టీకాల రిజిస్టర్లను పరిశీలించారు. టీకాల నమోదులను ఆన్‌లైన్‌లో మ్యాపింగ్ చేయాలని సూచించారు. పీఎంఎంవీవై, వయోజనుల బీసీజీ టీకాల రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం సిబ్బంది వివరాలను, వైద్యశాల స్థితిగతులను డాక్టర్ రవితేజనాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల సేవలను మెరుగు పరుచుకోవడానికి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ స్థాయి బాలల రక్షణ కమిటీలు అవసరం



మాట్లాడుతున్న గుడ్ షెపర్డ్ కాన్వెంట్ డైరెక్టర్ సిస్టర్ విన్నరసి

క్రోసూరు: క్రోసూరు మండలంలో ఆవలవారిపాలెం, పెరికపాడు, దొడ్లేరు గ్రామ సచివాలయాల్లో గుడ్ షెపర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి బాలల రక్షణ కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి క్రోసూరు మండలం ఇన్‌చార్జి తండు లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా గుడ్ షెపర్డ్ కాన్వెంట్ డైరెక్టర్ సిస్టర్ విన్నరసి పాల్గొని మాట్లాడుతూ బాలల హక్కులు కాపాడాలంటే గ్రామ స్థాయిలో బాల సంరక్షణ కమిటీలు ఎంతో అవసరమని అన్నారు. చాల మంది పిల్లలు ఇప్పటికీ బాల కార్మికులుగా ఉన్నారని, అలాంటి పిల్లల్ని తిరిగి బడికి పంపించే కార్యక్రమం బాల రక్షణ కమిటీ బాధ్యత అని అన్నారు. అదే విధంగా బాల్య వివాహాలు ఇంకా ఏదో ఒక రూపంలో జరుగుతూనే ఉన్నాయన్నారు . బాల్య వివాహాల నిర్మూలన చట్టం 2006 ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాత వివాహాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆవులవారిపాలెం గ్రామ సర్పంచ్ తిరుమల శ్రీను, పంచాయతీ సెక్రటరీ రవికుమార్, అంగన్‌వాడీ టీచర్లు ఆశా వర్కర్లు, మహిళా పోలీసులు సచివాలయ సిబ్బంది, యానిమేటర్లు, స్కూల్ కమిటీ చైర్మన్‌లు, పెద్దలు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులకు 'ఉల్లాస్' ఎంతో ఉపయోగం

ఎంపీడీవో వై.హనుమారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీవో హనుమారెడ్డి

బెల్లంకొండ: ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమం నిరక్షరాస్యులకు వరం లాంటిదని ఎంపీడీవో వై.హనుమారెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో ఎంపీడీవో అధ్యక్షతన వయోజన విద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా డ్వాక్రా గ్రూపుల్లో చదువురాని మహిళలకు ప్రాథమిక అక్షరాస్యతను నేర్పించనున్నట్లు తెలిపారు. ప్రాథమిక అక్షరాస్యత అంటే చదవడం, రాయడం, గణిత ప్రక్రియలు నెరవేర్చడమే కాకుండా మారుతున్న సమాజానికి అవసరమైన ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, లీగల్ అక్షరాస్యత, వీడియో పాఠాలు కూడా నేర్పుతారని తెలిపారు. ఎస్‌హెచ్‌జీ మహిళా గ్రూపులోని వలంటీర్ టీచర్లు మూడు నెలల పాటు నిరక్షరాస్యులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, అక్షరాస్యులుగా చేయాల్సిన బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఉషశ్రీ, వివిధ గ్రామాల సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు హక్కుకు 1,620 దరఖాస్తులు

అచ్చంపేట: త్వరలో జరిగే కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికలకు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అచ్చంపేట మండలంలో 1,620 మంది ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విధానంలో దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దారు జి.శ్రీనివాస యాదవ్ గురువారం తెలిపారు. గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తులను సార్టింగ్ చేసి వాటిలో అర్హులను పరిశీలించేందుకు దరఖాస్తులను సంబంధిత వీఆర్వోలకు ఇవ్వడం జరిగిందన్నారు. 2021 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారందరి దరఖాస్తులను ఆమోదించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు దారులు అర్హత, ఆధార్, ఎపిక్ తదితర ధ్రువీకరణ పత్రాలను గెజిటెడ్ అధికారిచే అటెస్ట్ చేసి వీఆర్వోలకు 8వ తేదీ సాయంత్రం లోపు ఇవ్వాలని, వారి పేర్లు మాత్రమే తుది జాబితాలో చేర్చడం జరుగుతుందన్నారు. వారం రోజులలో పూర్తి స్థాయిలో ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

తాళ్లచెరువులో గో సంరక్షణ శాల ఏర్పాటు



గో పూజ నిర్వహిస్తున్న పూజారి

అచ్చంపేట: కార్తిక మాసం పురస్కరించుకుని యువజన గ్రామిక రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని తాళ్లచెరువులో గో సంరక్షణ శాలను ఏర్పాటు చేసి గురువారం గో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ స్థాపకులు తుమ్మా మల్రెడ్డి మాట్లాడుతూ నరసరావుపేట విశ్వహిందూ గో రక్ష పరిషత్ విభాగానికి తాను ప్రముఖ్‌గా నియమితులైనట్లు చెప్పారు. తమ సంస్థ విశ్వహిందూ పరిషత్‌కు అనుబంధంగా పనిచేస్తుందన్నారు. విశ్వహిందూ పరిషత్ మూడు జిల్లాల ప్రముఖ్‌లు మన్నవ చలపతిరావు ప్రోత్సాహంతో గోవులను రక్షించే కార్యక్రమం చేపట్టడం జరిగిందని అందులో భాగంగా రెండు ఆవులతో ఈ గోశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కబేలాలకు తరలించే ఆవులను కూడా స్వీకరించి వాటికి రక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. వాటికి పుట్టే మేల్ దూడలను రైతులకు ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. వాటిని రైతులు విక్రయించడం గానీ, కబేలాలకు తరలించడం గానీ చేయకూడదన్నారు. ఈ సందర్భంగా శాస్త్రోక్తంగా గో పూజ కార్యక్రమం చేపట్టారు. గో ఎరువు, గో మూత్రం తదితర వనరుల ద్వారా ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

చీమలమర్రిలో గ్రామ సభ

నకరికల్లు: ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను అర్జీల రూపంలో స్వీకరించి ప్రజావేదికలో వెల్లడిస్తామని ఎస్ఆర్‌పీ ఎం.లోకేష్ చెప్పారు. మండలంలోని చీమలమర్రి గ్రామంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో గ్రామంలోని సచివాలయంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.67.48 లక్షలతో ఉపాధి హామీ పనులు చేపట్టినట్లు గుర్తించామన్నారు. కూలీలు, గ్రామస్తుల అభిప్రాయాలు సేకరించి రికార్డు పూర్వకంగా నమోదు చేశామని అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీ శివయ్య, ఏపీవో సుందరరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి ఆలయ రోడ్డుకు మరమ్మతులు

అచ్చంపేట: మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని అడవిలో స్వయంభూగా వెలసిన సత్తెమ్మతల్లి ఆలయానికి వెళ్లే రోడ్డుకు గురువారం మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలు పడిపోవడంతో ఆలయ కార్యనిర్వహణాధికారి కోటిరెడ్డి గుంతలు పూడ్చి, రోడ్డు మార్జిన్‌లోని చెట్లను తొలగించే మరమ్మతు పనులను చేపట్టారు. మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకటేశ్వరరావు పరిశీలించారు.